మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## జడ్చర్ల మోస్ట్ హ్యాపెనింగ్

# ప్లేస్ ఇన్ తెలంగాణ

**- రెవెన్యూ డివిజన్ చేయాలంటూ అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**జడ్చర్ల,డిసెంబరు 17 ప్రభాతవార్త :** జడ్చర్ల కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటు చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గత ఎమ్మెల్యే జడ్చర్లను రెవెన్యూ డివిజన్ గా చేస్తామని ప్రతిసారి ఎన్నికల్లో హామీ ఇచ్చి ఎన్నికల తర్వాత తనహామీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో కొత్త రెవెన్యూ డివిజన్లు,కొత్త మండలాల ఏర్పాటుపై మంగళవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో అనిరుధ్ రెడ్డి కూడా మాట్లాడారు.జడ్చర్ల రెవెన్యూ డివిజన్ చేయాలని స్థానిక ప్రజలు ఎప్పటి నుంచో ఆందోళనలు, నిరసనలు చేస్తున్నారని చెప్పారు.తెలంగాణ రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మోస్ట్ హ్యాపెనింగ్ ప్లేస్ జడ్చర్ల అని పేర్కొన్నారు. జడ్చర్ల రెవెన్యూ డివిజన్‌తో పాటుగా కొల్లూరును కొత్త మండలంగా చేయాలని కూడా అనిరుధ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాధానమిస్తూ, గత ప్రభుత్వ హయాంలో కొత్తగా ఏర్పాటు చేసిన రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో ఇప్పటి వరకూ అవసరమైన సిబ్బంది సౌకర్యాలను ఏర్పాటు చేయలేదని తెలిపారు. అయితే శాసనసభ్యులు కోరిన రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు విషయంగా అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకొని, వాటిని ఏర్పాటు చేయడానికి ఫీజుబులిటీ ఉన్న పక్షంలో ఎలాంటి భేషజాలకు పోకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## టీ జీవోలు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి

**నారాయణపేట కలెక్టర్ సిక్తా నాయక్**



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త :** ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న టీజీవోలు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎస్పీ యోగేష్ గౌతమ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ అధ్యక్షులు మొగులప్ప కలెక్టర్‌కు వారిని పరిచయం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్. పి.నూతన కమిటీ సభ్యులను అభినందించారు.



# వణుకుతున్న పాలమూరు

- 8 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- అత్యల్పంగా రాజాపూర్,బల్మూరులో నమోదు
- ఎండ ఉన్నా..రోజంతా చలి తీవ్రత తగ్గలే..
- వాతావరణంలో విభిన్న మార్పులు
- పిల్లలు. వృద్ధులపై జాగ్రత్తలు అవసరం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 17, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు వణుకుతున్నది. గత మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం 10గంటలు దాటినా రోడ్లపై మంచు కప్పిఉండడం ఆందోళన కలిగిస్తున్నది. మధ్యాహ్నం సమయంలోనూ ఎండ తీవ్రత ఉన్నా చలి ప్రభావం ఉండడంతో జనాలు ఇండ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాజాపూర్‌లో 8.6డిగ్రీలు, బల్మూరులో 9.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా అన్ని జిల్లాల్లోనూ 10డిగ్రీల వరకు టెంపరేచర్ పడిపోయింది.

**భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు..**

వాతావరణంలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం ఎండ తీవ్రత కొనసాగుతున్నా చలి మాత్రం తగ్గడం లేదు. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది టెంపరేచర్ పడిపోయిందని చెప్పవచ్చు. గత ఏడాది కంటే సుమారు 3డిగ్రీల నుంచి 5డిగ్రీల వరకు డ్రాప్ అయినట్లు తెలుస్తున్నది. ఉమ్మడి పాలమూరులోని నల్లమల ప్రాంతం కృష్ణా నదీ తీర ప్రాంతాలు కూడా చలితీవ్రత ఎక్కువగా ఉన్నది. పొగ మంచు ప్రభావం కూడా పెరిగింది. ఉదయం 9గంటలు దాటినా రోడ్లను పొంగమంచు కప్పి ఉంచడంతో



| జిల్లా | మండలం | అత్యల్పం |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | రాజాపూర్ | 8.6డిగ్రీలు |
| నాగర్‌కర్నూల్ | బల్మూరు | 9.1డిగ్రీలు |
| నారాయణపేట | దామరగిద్ద | 9.6డిగ్రీలు |
| జోగులాంబ గద్వాల | గద్వాల | 10.9డిగ్రీలు |
| వనపర్తి | గోపాల్‌పేట | 10.9డిగ్రీలు |

వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీలైనంత వరకు పొగమంచులో వాహనాలతో ప్రయాణం చేయవద్దని చెబుతున్నారు.

**అప్రమత్తత అవసరం..**

రాష్ట్రమంతా వాతావరణంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే మరికొన్ని రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎండ ఉన్నా చలి తీవ్రత తగ్గకపోవడం కొంత ఆందోళన కలిగిస్తున్న అంశంగా వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు బయటకు రాకుండా ఉండాలని, అవసరమైతే ఉన్నీ దుస్తులు ధరించాలని, చెవులు కప్పి ఉంచేలా దుప్పట్టా ధరించి బయటకు వెళ్లాలని చెబుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు సర్వే

# త్వరగా పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్**



బి.సి రెసిడెన్షియల్ పాఠశాలలో
ఆహార నిల్వల స్టాక్ ను పరిశీలించిన అదనపు కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 17 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని, సర్వేలో తప్పులు లేకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మంగళవారం ఉదయం పెద్దమందడి మండలం, వెల్టూర్ గ్రామంలో జరుగుచున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒక్కో సర్వేయర్ రోజుకు కనీసం 25 ఇళ్ళు పూర్తి చేయాలని ఆన్లైన్ లో డేటా నింపేటప్పుడు తప్పులు చేయవద్దని సిబ్బందిని సూచించారు. అనంతరం వెల్టూర్ లో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల సంఖ్య, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి. అనంతరం మహాత్మ జ్యోతిభాపులే బి.సి రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. మెస్ కమిటీ ఏర్పాటు చేశారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార నిల్వల స్టాక్ ను పరిశీలించిన అదనపు కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసారు. భోజనం నాణ్యతతో పాటు మెనూ ప్రకారం చేసి పిల్లలకు వడ్డించాలని, పారులిశుద్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెద్దమందడి తహశీల్దార్ సరస్వతి, ఇన్చార్జి ఎంపీడీఓ పుష్ప, ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీ తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

## నైపుణ్య వంతులైన క్రీడాకారులను

# వెలికి తీయడమే సీఎం కప్ లక్ష్యం

**ప్రతి క్రీడాకారుడు అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలి**

**రాష్ట్ర స్పోర్ట్స్ అధారిటీ చైర్మన్ కె.శివసేన రెడ్డి**



సీఎం కప్ క్రీడల ప్రారంభోత్సవ సందర్భంగా
మాట్లాడుతున్న రాష్ట్ర స్పోర్ట్స్ అధారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 17 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతంలో ఉండే నైపుణ్యవంతులైన క్రీడాకారులను వెలికితీసి అంతర్జాతీయ స్థాయికి పంపించడమే సి యం కప్ లక్ష్యం అని రాష్ట్ర స్పోర్ట్స్ అధారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి పేర్కొన్నారు. డిసెంబర్ 17 నుండి 21 వరకు జరుగనున్న జిల్లాస్థాయి సి.యం కప్ క్రీడలను మంగళవారం స్పోర్ట్స్ అధారిటీ చైర్మన్ వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ బాలుర కళాశాల క్రీడా మైదానంలో అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామినస్థాయి, మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను అభినందనలు తెలిపారు. సి.యం కప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సి.యం కప్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను అకాడమీలో శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. అదేవిధంగా ప్రశంసా పత్రాలకు భవిష్యత్తులో ఉద్యోగ నియామకాల్లో గ్రేస్ మార్కులు ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇటీవల ఒలంపిక్ క్రీడల్లో రాణించి దీప్తి, నిఖత్ జరీనా లను గుర్తుచేస్తూ ఉదహరించారు. రాబోయే రోజుల్లో దేశానికి అత్యధికంగా అంతర్జాతీయ క్రీడాకారులు, కొచ్‌లు తెలంగాణ నుండే వచ్చే విధంగా రాష్ట్రంలో క్రీడలకు ప్రోత్సహిస్తామని తెలియజేశారు. చదువును ఏవిధంగా శ్రద్ధగా చదువుతారో అదే శ్రద్ధతో క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. వనపర్తిజిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ మంజూరు అయ్యిందని, 3.5కోట్ల వ్యయంతో ఒక స్విమ్మింగ్ పూల్, అంతర్జాతీయ ప్రమాణాలతో హాకీ మైదానం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి పై రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రత్యేక దృష్టి సారించారని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ డిసెంబర్ 7 నుండి 11 వరకు గ్రామ స్థాయి, మండలస్థాయిలో నిర్వహించిన -మిగతా2లో..

## క్షయవ్యాధి నిర్ధారణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి**



మొబైల్ ఎక్స్ రే
తీయించుకుంటున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 17 ప్రభాతవార్త :** క్షయ వ్యాధి నిర్ధారణకై జిల్లాలో నిర్వహిస్తున్న 100 రోజుల క్షయవ్యాధి నిర్ధారణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. వనపర్తి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చేందుకు నిర్వహిస్తున్న 100 రోజుల కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ కొరకు రూపాయలు 20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఆధునిక మోబాయిల్ ఎక్స్‌రే యంత్రాన్ని మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ప్రారంభించారు. స్వయంగా తాను ఎక్స్ రే తీయించుకున్నారు. మార్కెట్ లో ఒక్కో ఎక్స్‌రే కొరకు 500 పైన చార్జీలు వసూలు చేస్తుంటారని, 100 రోజుల్లో జిల్లాలోని దగ్గు జ్వరం తో బాధపడుతున్న వారందరినీ క్షేత్రస్థాయి లోనే పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారించేందుకు మొబాయిల్ ఎక్స్ రే యంత్రం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజలు భయపడకుండా ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. సాయినాథ్ రెడ్డి, డా. పరిమళ తదితరులు పాల్గొన్నారు.

## కందుల గిట్టుబాటు ధరకై రైతుల రాస్తారోకో

**ఐదు గంటల పాటు స్తంభించిన రాకపోకలు**

**రైతులతో చర్చలు జరిపి ఉన్న రేటుకు రూ.250 పెంచిన అధికారులు, చైర్మన్ శివారెడ్డి**



రాస్తారోకో చేస్తున్న రైతులు

**నారాయణపేట టౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త :** కందులకు గిట్టుబాటు అందించాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజులుగా నారాయణపేట మార్కెట్ యాడ్ వద్ద రైతులు ఆందోళన చేపడుతున్నారు. మొదటి రోజు చర్చలు విఫలం కావడంతో మంగళవారం మార్కెట్ యార్డ్ వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులు, కొనుగోలుదారులు, మార్కెట్ కమిటి చైర్మన్ స్పందించలేదంటూ మార్కెట్ యార్డ్ ముందున్న ప్రధాన రహదారిపై రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మార్కెట్‌కు కందులు తీసుకొచ్చిన రైతులు గత రెండు రోజులుగా ఇబ్బందులు పడుతున్న పట్టించుకునేవారు లేదన్నారు. ఉన్నట్టుండి కందుల రేట్లు పెద్ద మొత్తంలో తగ్గడంతో రైతులు ఆందోళనకు దిగారు. గిట్టుబాటు ధరను ప్రకటించే వరకు ఆందోళన విరమించేది లేదని పట్టుబట్టారు. రైతులకు అండగా సిపిఐ, సిపిఎం,పిడిఎస్‌యు, భారతీయ కిసాన్ సంఘ నాయకులు మద్దతును తెలియజేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని - మిగతా4లో..

# ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

- రాష్ట్రంలోని 12కస్టర్లలో ఉమ్మడి పాలమూరు మామిడి పంటకు ఎంపిక
- కలెక్టరేట్‌లో ఆదర్శ రైతులకు అవగాహన సదస్సు
- రైతులు సద్వినయోగం చేసుకోవాలి : కలెక్టర్ విజయేంద్ర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు17, ప్రభాతావర్త :** క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం కింద మామిడి పంట సాగు,సేంద్రీయ ధృవీకరణ,మార్కెటింగ్,ఎగుమతి అంశాలపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆదర్శ రైతులకు నిర్వహిస్తున్న అవగాహన,ఇంటరాక్టివ్ సమావేశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో మామిడి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద మామిడి తోటల నమోదు, సేంద్రీయ ధృవీకరణ, ఎగుమతి దేశీయ మార్కెట్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆదర్శ రైతులకు అవగాహన, ఇంటరాక్టివ్ సమావేశాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం ప్రపంచ మార్కెట్లో పోటీపడే విధంగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో, కేంద్ర ప్రభుత్వం హార్టికల్చర్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం అనే పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద దేశంలో 11 రాష్ట్రాల్లో 12 క్లస్టర్లలో ప్రయోగాత్మకంగా అమలు చేయడం ప్రారంభించిందని అన్నారు. మన రాష్ట్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను (ప్రస్తుత మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల్, నారాయణపేట) మామిడి పంటకు ఎంపిక చేసి, ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం ప్రారంభించిందని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారుగా 17,000 మందికి పైగా రైతులు, 52,912 ఎకరాలలో మామిడి పండ్ల సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు సుమారుగా రూ.165 కోట్ల బడ్జెట్ తో ప్రసాద్ సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్‌ను అమలు ఏజెన్సీగా జాతీయ -మిగతా4లో..

# ప్రారంభమైన జిల్లా సీఎం కప్ 2024 పోటీలు

- క్రీడాకారులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించిన జిల్లా కలెక్టర్
- జాతీయస్థాయిలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలి: జిల్లా ఎస్పీ
- నాగర్‌కర్నూల్-ఊరుకొండ జట్ల మధ్య టాస్ వేసి ఖోఖో క్రీడా పోటీలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్
- నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



జ్యోతి ప్రజ్వలన చేసి
ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయడం కోసం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను జిల్లా ఎస్పీ వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జెండాను ఎగరవేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన విద్యార్థుల, క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను తేది 17-12-2024 నుండి 20-12-2024 వరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో రాణించే విధంగా శిక్షణ ఇవ్వడమే సీఎం కప్ క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు 20 మండలాలు ,4 మునిసిపాలిటీల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని, వారికి అవకాశాలు లేక వారి ప్రతిభ ప్రపంచానికి తెలియకుండా పోయిందన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారిని జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు రూపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి, క్రమశిక్షణకు, తోడ్పడుతాయన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు చదువులో కూడా ప్రతిభ కనబరుస్తారన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతోపాటు వారికి ఇష్టమైన ఏదో ఒక క్రీడలు రాణించాలని కలెక్టర్ సూచించారు, క్రీడాకారులు గెలుపు ఓటములను సమంగా స్వీకరించాలన్నారు. గెలుపుతో పొంగిపోవద్దని ఓటమితో కృంగిపోవద్దని గెలుపు కోసం ప్రయత్నించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.
జాతీయస్థాయి క్రీడలలో పాల్గొని జిల్లాకు ఎక్కువ పథకాలు తేవడమే ముఖ్యఉద్దేశమని అన్నారు. క్రీడాకారులకు జిల్లా నుండి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు.
నాగర్‌కర్నూల్-ఊరుకొండ జట్ల మధ్య టాస్ వేసి ఖోఖో పోటీలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్ మాట్లాడుతూ గ్రామీణ మండల స్థాయిలో విజయం సాధించి జిల్లా స్థాయిలో పాల్గొంటున్న క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో జిల్లా ఖ్యాతిని పెంపొందించాలని అధిక మొత్తంలో జిల్లాకు పథకాలు - మిగతా4లో..

## ప్రతి బూత్‌లో బీజేపీ జెండా ఎగరాలి

**- పంచాయతీ ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా పని చేయాలి**

**- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి**

**ఊర్కొండ, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** బూతు స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి ఒక్క కార్యకర్త నాయకుడు కష్టపడి పనిచేసి పార్టీ మరింత బలో పేతానికి కృషి చేయాలని ఊర్కొండ మండల ఇన్చార్జ్, బిజెపి మహిళా మోర్చా మహబూబ్‌గర్ జిల్లా అధ్యక్షు రాలు బి సాహితీ రెడ్డి పిలు పునిచ్చారు. ఊర్కొండ మండల అధ్యక్షుడు ఆంజనే యులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బూతు ఎన్నికల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని, ఇంటికి పునాది ఎంత అవసరమో పార్టీకి బూత్ కమిటీ అంతే అవసరమని పేర్కొన్నారు. ప్రతి బూత్ కమిటీని ఏర్పాటు చేయడం, బూత్‌లో కొత్తవారిని పార్టీలోకి ఆహ్వానించడం, బూత్‌లో బిజెపి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముం దుకు సాగుతున్నట్లు తెలిపారు. బూత్ అధ్యక్షుడి నుండి జాతీయ అధ్యక్షుడి వరకు పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా పార్టీ సంస్థాగతంగా నిర్మాణం జరగాలని ఆమె ఆకాంక్షించారు. రాను న్న పంచాయితీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సాహితీ రెడ్డి కోరారు. కార్యక్ర మంలో పాలమూరు జిల్లా కో రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రాజేశ్వర్, బీజే వైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యద ర్శులు రాజేందర్ పరశురాం, నాయకులు శ్రీనివాస్ బ్రహ్మచారి శివా పూర్ణ శ్రీకాంత్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాహితీరెడ్డి

## డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలి

**- బీసీ జాగృతి సేన మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు**

**జడ్చర్ల, డిసెంబరు17, ప్రభాతవార్త :** త్వరలో రాష్ట్రప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రానికి 3500 ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ఇండ్ల పంపిణీ చేయాలని బీసీ జాగృతి సేన మండల ప్రధాన కార్యదర్శి గొడుగు నరసింహులు కోరారు. జడ్చర్ల పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో బీసీ జాగృతి సేన మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన లబ్ధిదారులకు పథకం వర్తింపజేయాలని కోరారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో, పట్టణ అధ్యక్షులు శివరాములు, నాయకులు కట్ట మురళి, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు భీమ్ రాజ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, ధర్మసమాజ్ పార్టీ నాయకులు రంగయ్య, గొల్లపల్లి యాదయ్య, నాగేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను ఖండించండి

**హైదరాబాద్ ఇంద్ర పార్క్ దగ్గర జరిగే ధర్నాకు పర్మిషన్ ఇచ్చి కార్మికులను అరెస్టు చేయడం సిగ్గుచేటు**

**ధన్వాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త :** మరికల్ అక్రమంగా అరెస్టు చేసిన గ్రామపంచాయతీ కార్మికు లను వెంటనే విడుదల చెయ్యాలని (టియుసిఐ) జిల్లా సహయ కార్యదర్శి పి. రామంజనేయులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేస్తాం జీతాలు పెంచుతామని టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సమ్మె చేస్తున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పర్మినెంట్ కావచ్చు జీతాలు పెంచకపోవడం సిగ్గుచేటు అన్నారు ఈరోజు ఇంద్ర పార్క్ ధర్నాకు బయలుదేరిన జిల్లావ్యాప్తంగా కార్మికులను ఎక్కడికి ఎక్కడ అరెస్టులు చేయడం సరికాదన్నారు. అరెస్ట్ అయిన కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులను వెంటనే పర్మనెంట్ చేయాలని పెండింగ్ లో ఉన్న రెండు నెలల నుండి ఆరు నెలల వరకు వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.




గ్రామ పంచాయతీ కార్మికులను అరెస్టు చేసిన దృశ్యం

## ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

**సిఐటియు జిల్లా కార్యదర్శి, ఆర్ఎన్ రమేష్**

**అమరచింత డిసెంబరు 17 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఆశ వర్కర్లకు కనీస వేతన 18000 ఇస్తామని వాగ్దానంచేసిన ఇప్పటివరకు అమలుచేయడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి, ఆర్ఎన్ రమేష్ అన్నారు. మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని డిఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అమరచింత ఆత్మకూర్ మండలాల ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్న ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆశ వర్కర్ల తో ప్రభుత్వం మెట్టిచాకిరి చేయించుకుంటున్న వారికి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23 నా వనపర్తి జిల్లాలో బస్సు యాత్ర ప్రారంభిస్తున్నామని ఈబస్సు యాత్రకు జిల్లాలో ఆశ వర్కర్లు భారీగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లానాయకులు బుచ్చన్న, ఆశవర్కర్లు శాంతమ్మ, సంధ్య, సుజాత, రాజేశ్వరి, శ్యామల, అరుణ, జయరామి, రషీదా బేగం తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన

**దేవరకద్ర, డిసెంబరు 17 ప్రభాతవార్త :** లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద గిరిజన దళిత రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం దేవరకద్రలో ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ నుండి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు కురువ శ్రీకాంత్ యాదవ్, దేవరకద్ర పిఎసిఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ దొబ్బలి ఆంజనేయులు, నాయకులు చల్మారెడ్డి, కొండారెడ్డి, సయ్యద్ గౌస్, కోట్ల భాస్కర్‌రెడ్డి, శ్యాం సుందర్ రెడ్డి, గుజ్జుల శ్రీనివాస్, తిరుపతయ్య, మోహన్ రెడ్డి, శేఖర్, నారాయణ, కృష్ణారెడ్డి, బాలరాజ్, షరీఫ్, ఆంజనేయులు, రమేష్ గౌడ్, జగన్, గిద్దె రాములతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే తీర్చాలి

**నారాయణపేట టౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త :** సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె మంగళవారంతో ఎనిమిదవ రోజుకు చేరుతుంది. సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు తెలిపిన తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్. మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాన్ని జీవో16పై హైకోర్టు తీర్పును సాకు చూపిస్తూ వీళ్ళని రెగ్యులర్‌చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఇందులో పనిచేసే ఉద్యోగులందరూ అన్నియోగ్యతలు ఉన్నవారని వారు రోస్టర్‌ద్వారా సెలెక్ట్ అయినవారని వీళ్లను చాలా సులభంగా రెగ్యులర్ చేయొచ్చని ప్రభుత్వం కాలయాపన చేయకుండా వీరందరినీ కూడా రెగ్యులర్ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తపస్ జిల్లా కృష్ణారెడ్డి ఉద్యోగులు ఎల్లాగౌడ్, గౌరమ్మ, విజయ, శాలిని, రాజ్యలక్ష్మి, మహిపాల్, రాజు, రాజశేఖర్, మనోహర్, నవీన్, నరేష్‌లు పాల్గొన్నారు.




# రైతులపై దౌర్జన్యం అమానుషం

- కేసులు బనాయించడం తగదు..
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- భూత్పూర్‌లో గిరిజనులతో కలిసి డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పణ

**భూత్పూర్, డిసెంబరు 17, ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో రైతుల భూముల్ని లాక్కొని, వారిపై అక్రమ కేసులు బనాయించి, రైతులపై దౌర్జన్యాలకు పాల్పడడం అమానుషమని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. దళిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని పేర్కొంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీంరావ్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు, ఆదేశాల మేరకు మంగళవారం భూత్పూర్‌లో గిరిజనులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహిం చారు. భూత్పూర్ చౌరస్తాలోని డాక్టర్ భీంరావు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని, తమ భూములు తమకివ్వాలని కోరిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేయించి, వారిక కేసులు బనాయించి, రైతుల చేతులకు బేడీలు వేయించి వారిని జైళ్లలో నిర్బంధించి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఎంత వరకు సబబని ఆల ప్రశ్నించారు. ప్రభుత్వం రైతులపై బనాయించిన అక్రమ కేసుల్ని ఎత్తి వేయాలని, అమానుష చర్యలు, అణిచివేత చర్యల్ని మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డితో పాటు నాయకులు మనెమోని సత్య నారాయణ, సత్తూర్ నారాయణగౌడ్, టి మురళిధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, రాచూరి చంద్రమౌళి, మొల్గర నర్సింహ్మారెడ్డి, మేకల సత్య నారాయణ, గడ్డం ప్రేమ్‌కుమార్, నరేష్‌గౌడ్, మందడి సరోజ్‌రెడ్డి, మొహ్మద్ సాధిక్, సత్తూర్ సురేష్‌గౌడ్, గడ్డం యాదయ్య, మూష సాయిలు, పులగుర్ల మల్లేష్, గడ్డం రాములు, జాకీర్, సత్తూర్ రాకేష్‌గౌడ్, రాము రాథోడ్, సత్తూర్ అశోక్‌గౌడ్, గడ్డం డీలక్ నర్సింహ్మా, మండిఆటో వెంకటయ్య, అంజనేయులు నాయక్, జయపాల్ నాయక్, సత్తూర్ వెంకటేష్ గౌడ్, మాల విఠల్‌దాస్ వెంకటేష్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



భూత్పూర్‌లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

# రైతుకు బేడీలు నిరంకుశత్వానికి నిదర్శనం

**బిజినేపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త :** లగచర్ల గిరిజన రైతుకు బేడీలు నిరంకుశత్వానికి నిదర్శనం అని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, ధర్నా చేపట్టారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గిరిజనులు, దళితులు, పేద రైతులపై అక్రమ కేసులు పెట్టి సంగారెడ్డి సెంట్రల్ జైల్లో ఖైదీలుగా చేసి చిత్రహింసలకు గురిచేయడం వల్లే హీర్యా నాయక్ అనే గిరిజన రైతుకు గుండెపోటు వచ్చిందని, అయినా కనికరించకుండా కరుడుగట్టిన ఖైదీలకు బేడీలు వేసినట్టు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క నిరంకుశత్వానికి నిదర్శనమని అన్నారు. టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులేందర్ రెడ్డిలు మాట్లాడుతూ లగచర్లలో అధికారులపై దాడి చేశారనే పేరుతో గిరిజన, దళిత, పేద రైతులను సంగారెడ్డి జైల్లో చిత్రహింసలు గురిచేస్తున్నారనడానికి గిరిజన రైతు హిర్యానాయక్ సంఘటనే నిదర్శనమని ఆరోపించారు. క్రిందిస్థాయి అధికారులే రైతుకు బేడీలు వేశారని అందులో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదనే సాకుచూపి తప్పించుకోవాలని చూస్తున్నదని అన్నారు. మాజీ మండల రైతుబంధు అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే ఇలాగే ఉంటుందని హెచ్చరించాలనే ఉద్దేశంతోనే గిరిజన రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేశారని అన్నారు. లగచర్లలో ఎటువంటి పరిశ్రమలను ఏర్పాటు చేయడం లేదని ఒకవైపు ప్రకటిస్తూనే మరోవైపు అక్కడి గిరిజనులు, దళితులు, పేద రైతులపై పోలీసు నిర్బంధకాండ ఆపకుండా ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆరోపించారు. దాడికి ఎటువంటి సంబంధం లేని రైతులను సైతం అరెస్టులు చేస్తూ చిత్రహింసలకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి సెంట్రల్ జైల్ నుండి తక్షణం విడుదల చేయాలని లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పూనుకుంటామని హెచ్చరించారు. అరెస్టు చేసిన అన్నదాతలను విడుదల చేయాలని అంబేద్కర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వంశీ నాయక్, తిరుపతిరెడ్డి, బాలస్వామి, రాజుగౌడ్, ఇగురుబంద శ్రీనివాసులు, కాసిరెడ్డి చంద్రారెడ్డి, ఐల రవీందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనమోని శ్రీశైలం, కృష్ణ, సాకలి శీను, ఖదీర్, రిజ్వాన్ తదితరులు ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న మండల టిఆర్ఎస్ నాయకులు

# రాష్ట్ర సమాచార శాఖ బడ్జెట్లో సబ్ ప్లాన్ అమలు చేయాలి

**మీడియా అక్రిడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాలని ఫిర్యాదు**

**ఉప్పునుంతల, డిసెంబరు 17 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ జారీ చేసే ప్రకటనలలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కింద బడ్జెట్‌ను కేటాయించి, ఎస్సీ ఎస్టీ పత్రికలను ప్రోత్సహించాలని కోరుతూ మంగళవారం తెలంగాణ అంబేద్కర్ మీడియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్‌లో డిప్యూటీ డైరెక్టర్ చరణ్ దాసుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మీడియా కమిటీల్లో, అలాగే అక్రిడిటేషన్ కమిటీలో ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరినట్లు వారు ఫిర్యాదు లో పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఆర్టికల్ 46 లో సూచించినట్లు ప్రభుత్వం బలహీన వర్గాలు, ఎస్సీ ఎస్టీల విద్యకు సంబంధించి, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి విశేష శ్రద్ధతో పనిచేయాలని, అన్ని రకాల దోపిడీల నుంచి ఆయా వర్గాలను రక్షించాలని సూచిస్తుంది. ఈ నిబంధన ప్రకారం బడ్జెట్ కేటాయించాలని వారు కోరారు. అదే విధంగా రాజ్యాంగంలోని 16వ భాగం ఆర్టికల్ 335 ప్రకారం యూనియన్ లేదా రాష్ట్ర సర్వీసులు, పోస్టులను నియామకం చేయుటలో ఎస్సీ, ఎస్టీ తెగల వారి దరఖాస్తులను పరిగణంలోకి తీసుకోవాలని సూచిస్తుంది. ఈ మేరకు తెలంగాణ మీడియా అకాడమీ విచారణ చేయాలని కోరారు. త్వరలో జాతీయ ఎస్టీ కమిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్ మూడవత్ రాములు, జర్నలిస్టులు శాంతయ్య, ధర్మానాయక్, జర్నలిస్టులు సాయిరాజ్, జగదీశ్వర్‌తోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



జాతీయ కమిషన్ కు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

# ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**నారాయణపేట టౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త :** ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టాపిక్ కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తా, యాద్గిరి ప్రధాన రహదారి పై ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాల్‌రాజు మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు గురికారాదు అని, సైబర్ నేరాలకు గురైతే 1930టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందని, జాగ్రత్తగా వచ్చే వారి వాహనాలకు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగా అవకాశం ఉంటుంది అని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానా తో పాటు జైలుకు పంపించడం జరుగుతుంది అని తెలిపారు. మద్యపానం సేవించడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఎక్కువ ఉంది కాబట్టి వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదు. వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు గోవింద్‌రెడ్డి, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# చిన్నరాజమూర్‌లో ఘనంగా ఆంజనేయస్వామి పల్లకిసేవ

**• వేలాదిగా తరలివచ్చిన భక్తులు • దాసంగాలతో స్వామివారికి నైవేద్యాలు**

**దేవరకద్ర, డిసెంబరు 17 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్‌లో శ్రీ ఆంజనేయస్వామి పల్లకిసేవ పూజా కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమా న్ని కన్నులపండవలా నిర్వహించారు. ఉత్సవాలలోని ప్రధానఘట మైన సా ్వమి వారి రథోత్సవం జరిగిన మరుసటిరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి వారిని పల్లకిలో దేవస్థానం చుట్టూ పురోహితులు ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ ప్రదిక్షణ ముందుకు కదిలింది. ఈ సందర్భంగా అలంకరణలో స్వామి వారు దేవస్థానం ఆవరణలో పల్లకిలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ ప్రదిక్షణల అనంతరం స్వామి వారిని అదే పల్లకిలో దేవస్థానంలోకి తీసుకెళ్ళి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ పూజను పురోహితులు శాస్రోక్తంగా, సాంప్రదాయరీతిలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన కొన్ని వేల మంది భక్తులు స్వామి వారి పల్లకిసేవను కనులారా తిలకించి తన్మయం చెందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్, వంశపారంపర్య ధర్మకర్త రాఘవేంద్రచారి, ఈఓ కవిత మేనేజర్ ప్రసాద్‌లతో పాటు పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

**అలంకరణలో స్వామి వారి మూలవిరాట్..**

ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌ను వివిధ రకరకాల పూలతో పాటు వివిధ ఆభరణాలతో సార్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని కూడ అలంకరించారు. ఈ ఉత్సవాలకు జిల్లా ను ండేగాక ఇతర రాష్ట్రాలనుండి భక్తులు అధికసంఖ్యలో చిన్నరా జమూర్‌కు తరలివచ్చా రు. దీంతో చిన్నరాజమూర్ జనసంద్రాన్ని తలపించింది. దేవస్థానం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఈ సంద ర్భంగా భక్తులు కోనేరు లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొన్నారు. గ్రామంలో ఎక్కడ చూసిన భక్తులే కనిపించారు. స్వామి వారి ఉత్సవాల సందర్భంగా దేవస్థానం వద్ద వివిధ తినుబండారాలు, ఆటవస్తువులు, వంటసామగ్రి తదితర దుకాణాలు వెలిశాయి. వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిర భక్తులు ఉపవాసదీక్షలతో వచ్చి స్వామి వారికి దాసంగాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకొన్నారు. తీపివంటకాలతో స్వామి వారికి నైవాధ్యాలు సమర్పించారు. దీంతో దేవస్థానం పరిసరాలు భక్తులు కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాలనుండి భక్తులు బస్సులు, ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు, వివిద వాహనాలలో చిన్నరాజమూర్‌కు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానాన్ని వివిధ రంగురంగుల విద్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించారు.



అలంకరణలో ఆంజనేయస్వామివారు

## పాఠశాలలను పరిశీలించిన సీఈవో



భోజనాన్ని పరిశీలిస్తున్న సీఈఓ

**నారాయణపేట టౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త :** జిల్లాలోని కస్తూర్బా పాఠశాల హాస్టల్ లో మంగళ వారం జిల్లా పరిషత్ సీఈవో భాగ్యలక్ష్మి కేజీబీవీను పరిశీలించారు. మధ్యాహ్నం భోజ నంలో మెనూను పాటించాలని తెలిపారు. కేజీబివి పాఠశాల లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిం చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి అన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించా రు. విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. డిప్యూటీ సిఈ ఓ. జ్యోతి, హాస్టల్ ప్రత్యేక ఆధికారి పాల్గొన్నారు.

## దేవరకద్రలో ఇరుముడి ధారణ

**దేవరకద్ర, డిసెంబరు 17 ప్రభాతవార్త :** దేవరకద్రలోని శివాలయంలో మంగళవారం అయ్యప్ప స్వాములు ఇరుముడి ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరిశెల శివకుమార్, ఆంజనేయులు స్వాములు ఇరుముడి ధారణ చేశారు. ఈ కార్యక్రమంలో లా ల్‌కోట కెంగూర్ అంజన్న యాదవ్ గురుస్వామి, బలిజ రాము స్వామి, సాయి, నరేష్ స్వాములు పాల్గొన్నారు.

## పుట్టపల్లిలో ఘనంగా పుణ్యహావాచనం

**కొనసాగుతున్న పోచమ్మదేవత వార్షిక బ్రహ్మోత్సవాలు**

**దేవరకద్ర, డిసెంబరు 17 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం పుట్ట పల్లిలో మంగళవారం పుణ్యహావాచనం పూజా కార్యక్రమాన్ని ఘ నంగా నిర్వహించారు. పుట్టపల్లిలో ఈ నెల 16 నుండి గ్రామదే వత శ్రీ పోచమ్మదేవత నాభిశిల(బొడ్రాయి)వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల రెండవ రోజు గుడి ముందు పచ్చని పందరి వేసి పుణ్యహావచనం పూజా కార్యక్రమంతో పాటు పంచగవ్యస్థాపణ, వాస్తుహోమం, రుద్ర హోమం, మహాపుర్ణాహుతి, పోచమ్మదేవత నాభిశిల(బొడ్రాయి) అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో పుట్టపల్లిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ పూజా కార్యక్రమాలకు గ్రామస్థులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

## ఆలయ నిర్మాణానికి 50,000 విరాళం

**ఆత్మకూరు డిసెంబరు 17 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో గల గ్రామదేవత జములమ్మ ఆలయ నిర్మాణానికి ఆత్మకూరు పట్టణానికి చెందిన ఉప్పరి విష్ణువర్ధన్ దంపతులు 50వేల రూపాయలను విరాళంగా అందజేశారు. జములమ్మ ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు గడ్డం భీమన్నకు మంగళవారం రోజు కలిసి ఆలయ నిర్మాణం కోసం తమవంతు గా 50వేల రూపాయలను విరాళంగా అందజేస్తున్నట్లుగా వారు వివరించారు. ఉదారంగా ఆత్మకూర్ పట్టణానికి చెందిన విష్ణువ ర్ధన్ దంపతులు 50 వేల రూపాయలను గుడి నిర్మాణం కోసం అందజేయడం పట్ల మూలమల్ల గ్రామస్తులు వారిని అభినందిం చడమే కాకుండా ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జమ్ములమ్మ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన మాజీ సర్పంచ్

**పెబ్బేరు డిసెంబరు17 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంతో మ్యాలపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాలమేరకు సురేందర్‌గౌడ్ మాజీ సర్పంచ్ సర్వేను పరిశీలించారు. ఇంది రమ్మ ఇండ్ల సర్వేపేదవాడికి ఇల్లు మంజూరు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజానాయకుడు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాలతో నియోజకవర్గంలో నేతృతంలో ప్రతి పేదవాడికి ఎస్సీ ఎస్టీ బీసీలకు ఇందిరమ్మ ఇండ్లు పకడ్బంధితో వివరాలు సేకరిస్తున్నారు.

## నైపుణ్య వంతులైన క్రీడాకారులను వెలికి తీయడమే సీఎం కప్ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి భాగం..**

సి.యం కప్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు శుభాభినందనలు తెలిపారు. అదే స్ఫూర్తితో జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్రస్థాయిలో సైతం గెలుపొంది వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అనేక మోలిక వసతులు కల్పించడం జరుగుతుందని, ఇటీవల మెస్ చార్జీలు సైతం పెంచడం జరిగిందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకోవడం అదేవిధంగా ఆటల పై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బి. శ్రీనివాస్ గౌడ్, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ సురేందర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బ్రహ్మం సైతం మాట్లాడి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆనంతకు ముందు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, అదనపు కలక్టర్ సి.యం కప్ పతాకాన్ని, వనపర్తి జిల్లా పతాకాన్ని ఆవిష్కరించి క్రీడాకారులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, తాయిక్వాండో క్రీడలను ప్రారంభించారు.

# లగచర్ల ఘటనపై బగ్గుమన్న బిఆర్ఎస్

## ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి




**కొత్తకోట డిసెంబరు 17 ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ,అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా మంగళవారం కొత్తకోట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, మాజీ సర్పంచులు ఎద్దుల నాగేష్, ఆకుల శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్, దళిత గిరిజన నాయకులతో కలిసి మాట్లాడుతూ లగచర్ల రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది ప్రజా పాలన కాదు, ఇది నియంత పాలన ఇది రెడ్ల రాజ్యం అన్నారు. ఎలక్షన్లకు ముందు మేము ప్రభు త్వంలోకి వస్తే మీ దళిత కుటుంబాలను ఆదుకుంటామని చెప్పిన ఈ దళిత ద్రోహి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియంత పాలన నడిపిస్తున్నాడు. ఇందుకేనా ఆ రోజు మాతో ఓట్లు వేయించుకున్నది ఇదేనా మీరు మా దళితులకు ఇచ్చే గౌరవం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీని యర్ నాయకులు మండల రైతు సంఘం అధ్యక్షులు కొండ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు,మాజీ మార్కెట్ వైస్‌చైర్మన్ యాదగిరి,జిల్లా యూత్ ఉద్యమ నాయకుడు కటికె శ్రీనివాస్,మాజీ సర్పం చులు గోపాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, మన్యం, శంకర్ నాయక్, మండల యూత్ అధ్యక్షులు పద్మ నెహ్రూ,గులాబీ గోవింద్,మాజీ మార్కెట్ డైరెక్టర్ కృష్ణగౌడ్, యుగంధర్‌రెడ్డి, సందేశీను, రాజు,గోవర్ధన్, ఆశన్న,పరశురాం, వెంకటేష్, లక్ష్మీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ నాగన్న, సురేందర్‌రెడ్డి, దాసరి విజయ్,వికాస్,మహేష్, సాయిలు, హోటల్ రాజు, కుర్మయ్య, ఇశ్రాయిల్, నక్క రాములు, రవీందర్ గౌడ్, రమేష్‌రెడ్డి, రవి,విష్ణు,శాంతన్న,తిమ్మన్నయాదవ్, జగదీష్,మతిన్, మన్యం, కుమార్,సృజన్, విద్యార్థి యూత్ టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



**అమరచింత డిసెంబరు17 ప్రభాత వార్త:** దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు ప్రజా పాలన ప్రభుత్వంలో రైతులకు సంకెల్లా అని టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అక్కల నరసింహులు గౌడ్ మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ,ఆత్మకూరు మార్కెట్ మాజీ చైర్మన్ ఎస్ఏ రాజు, టిఆర్ఎస్వి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మారాడి నరేష్‌రెడ్డి ఆత్మకూరు మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ నాగభూషణం గౌడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు లగచర్ల రైతుల అరెస్టుకు నిరసనగా మంగళవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల భూములను అక్రమంగా లాక్కోవడాన్ని అన్యాయమని ప్రశ్నించిన రైతులను ప్రభుత్వం పోలీసులు లాటి చార్జీ చేసి అక్రమంగా అరెస్టు చేసి జైల్లో వేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే జైల్లో ఉన్న రైతులను ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రులకు తీసుకువెళ్లడానికి రైతులను బేడీలు వేసుకొని ఆసుపత్రి తీసుకెళ్లడం దేశానికి సిగ్గుచేటని వారి విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టిన రైతులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని వారి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జింకరవి, చిన్న బాలరాజ్,ఖాన్ కలాంపాషా, అబ్రహం ,హోటల్ రాజేష్, జలంధర్, అక్బర్ ,సత్తన్న,షంషీర్,డిసి పురుషోత్తం ,తదితరులు పాల్గొన్నారు.



**నారాయణపేట టౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త :** లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైలులో నిర్బంధించి రైతన్న చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ అమానవీయ అణిచివేత విధానాలకు నిరసనగా మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కేటీఆర్ ఆదేశాలు మేరకు నారాయణపేట పట్టణంలో ఆ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి,వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నారాయణ పేట పట్టణం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో నారాయణ పేట పట్టణ, మండలం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**ఖిల్లాఘణపురం డిసెంబరు17 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత రాజ్యాంగానికి విరుద్ధంగా రైతులపై కేసులు నమోదు చేసి జైలు పాలు చేస్తూ రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీకి కను విప్పు కలిగించాలని టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి రాజ్యాంగాన్ని పరిరక్షించాలని వినతి పత్రాలు అందజేయడం జరిగిందని తాజా మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ ,మండల పార్టీ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య తెలిపారు.వీరితోపాటు టిఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, చిన్న ఆంజనేయులు గౌడ్, చెన్నారెడ్డి, పెద్ద ఆంజనేయులుగౌడ్, పోలిశెట్టి ప్రతాప్, బదుగాని చెన్నయ్య, పొయ్యికాటి చెన్నయ్య, బెస్త ఆంజనేయులు, బదుగని కురుమయ్య, గోనెల రామచందర్, కొరియాల రాజు పాల్గొన్నారు.



**ఆత్మకూరు డిసెంబరు 17 ప్రభాత వార్త:** రాష్ట్ర ప్రభుత్వం పేద రైతులపై అక్రమ కేసులు బనాయిం చడానికి నిరసిస్తూ మంగళవారం రోజు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూర్ పట్టణంలోని అంబే ద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్‌మాజీ ఎంపీపీ వీరేశ లింగం మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ నియోజక వర్గంలోని లగచర్ల గ్రామంలో రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కు నేందుకు ప్రయ త్నించగా తిరగబడిన రైతులపై సానుభూతి తెలియజేయకపోగా అక్రమ కేసులు బనాయిస్తూ రైతులకు బేడీలు వేసి జైలుకు తరలించడం నిరంకుశత్వానికి నిదర్శనమని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను బేసరత్తుగా ఎత్తివేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌గౌడ్,బంగారు శ్రీనివాసులు,కోటేశ్వర్,రామకృష్ణ జానకి రాములు, జహంగీర్ ,మాసన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**తెలకపల్లి, డిసెంబరు 17 ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీరుపై మంగళవారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మాధవరం హనుమంతరావు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిని జైళ్లలో నిర్బంధించడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులనుఎత్తివేసి, వారినివెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వా నికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మాధవరం హనుమంతరావు, సుందర్ రెడ్డి, కె.లక్ష్మారెడ్డి, బి.రాములు, బి.నరసింహ,మాజీ ఎంపీటీసీ ఆర్.రమేష్, జి.మాధవరెడ్డి, సత్యం, విష్ణు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

**వెల్దండ, డిసెంబరు 17 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లగచర్ల రైతుల పైన అక్రమ కేసులు పెట్టి వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైల్లో నిర్బంధించి రైతుల చేతులకు బేడీలు వేసి చిత్రహింసలు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలకు నిరసనగా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ పుట్టా.రాంరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్, చల్ల మధుసూదన్ రెడ్డి,జంగిలి నిరంజన్, జంగిల్ యాదగిరి, పోలే అశోక్, లింగం ముదిరాజ్, హనుమంతు నాయక్, రాజు, కొండల్‌యాదవ్, శేఖర్, ప్రభాకర్,నాగయ్య, శ్రీను,బాల్‌చెన్నయ్య, రవికుమార్, దశరథం ఉన్నారు.

# ఆలయాభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తా

● నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు17 ప్రభాతవార్త:** అయ్యప్ప స్వామి ఆలయ సన్నిధానంలో గత సంవత్సరం ఇచ్చిన హామీలతో పాటు ప్రస్తుతం ఇస్తున్న అన్ని హామీలను అమలు చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అయ్యప్ప స్వామి ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్న మహా పడిపూజ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాజకీయాలలోకి వస్తాను రాను అనుకున్న రోజులలోనే ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమానికి హాజరై అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు, గురుస్వాముల ఆశీర్వాదంతో ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించానని, ఇచ్చిన హామీ మేరకు మహా పడిపూజ కార్యక్రమానికి హజరైనట్లు వివరించారు. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న స్వామి ఆశీర్వాదం తీసుకునేందుకు పూజా కార్యక్రమాలలో హాజరయ్యాయని, ఆలయ అభివృద్ధికి అన్ని వసతులు కల్పిస్తానని అన్నారు. కొన్ని హామీలను నేరవేర్చానని, రహదారి నిర్మాణం మాత్రం పెండింగ్లో ఉందని, వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. భోజనశాల ఏర్పాటుతోపాటు భక్తులకు అన్ని వసతులు కల్పించే విధంగా ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు మహపడిపూజ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను అయ్యప్ప స్వాములు ఘనంగా సన్మానించి అయ్యప్ప ప్రతిమను బహుకరించారు. స్వాములతో కలిసి ఎమ్మెల్యే భీక్షా చేశారు. ఈ పూజా కార్యక్రమంలో గురుస్వామితో పాటు వందలాది మంది అయ్యప్పలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు అయ్యప్ప ప్రతిమను బహుకరిస్తున్న దృశ్యం

# కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

## స్థానిక ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి : బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మెరువ రాజు

**అమరచింత డిసెంబరు 17 ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలలో బిజెపి పార్టీ విజయానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి, మెరువ రాజు కోరారు. మంగళవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని 225 బూత్ కమిటీ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆయన అన్నారు. ఎన్నికలలో మహిళలకు 2500 జమ చేస్తామని వాగ్దానం చేసిన ఇప్పటివరకు అమలు చేయకుండా మహిళల ను మోసం చేసిన ప్రభుత్వమని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బిజెపి కార్యకర్తలు గడపగడపకు తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో క్యామ కుమార్,ఎం శ్రీకాంత్ ,తోకల శ్రీనివాసులు,ఒగ్గు పాండు,అమాలి రవి,హమాలి, వెంకటేష్ ,రాకేష్ శెట్టి ,హరీష్, రవి తదితరులు పాల్గొన్నారు.



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర నాయకులు

# లగచర్ల రైతులపై దాడి అమానుషం

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, డిసెంబరు17 ప్రభాతవార్త:** లగచర్ల రైతులపై దాడి కాంగ్రెస్ పార్టీ చేసిన దాడి అమానుష చర్య అని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం పేర్కొన్నారు. మంగళవారం టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 గ్యారెంటీల పేరుతో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను, మహిళలను సబ్బండ వర్గాలను ముంచుతోందని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసి రాష్ట్రంలో అరాచక పాలను కొనసాగిస్తుందని వారన్నారు. న్యాయం అడిగితే ఎమ్మెల్యేలు అని గౌరవం లేకుండా జైల్లో పెడుతున్నారని వారు పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ప్రజా సంక్షేమం కోసం, రైతు సంక్షేమం కోసం ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్ర మంలో, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సింగం విజయ్ గౌడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, మాజీ వైస్ ఎంపీపీ కొందూరు గోవర్ధన్, కౌన్సిలర్లు బాజిరెడ్డి తా హేర్‌అలి, సైదులు శ్రీనివాస్, సూర్య ప్రకాష్‌రావు మాజీ సర్పంచులు సుశీల నాయకులు దార మోని గణేష్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# నూతన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

## - టీఎస్ యుటిఎఫ్ వినతి

**మహబూబ్‌నగర్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** డీఎస్సీ-2024 నూతన ఉపాధ్యాయులు నియామకమై రెండు నెలలు పూర్తయిన ఇంకా వేతనాలు మంజూరు చేయలేదని వేతనాల మంజూరు కి ఉన్న అడ్డంకులను తొలగించి వెంటనే వేతనాలు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు కే రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేష్ డిమాండ్ చేశారు. జిల్లా ఆఫీస్ బేరర్లు అందరూ మంగళవారం డిఈఓ ప్రవీణ్ కుమార్‌కు, జిల్లా ట్రెజరీ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నూతన ఉపాధ్యాయులకు అక్టోబర్ 10న నియామక ఉత్తర్వులు జారీచేసి అదే రోజు నుంచి వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి అందుకు తగిన ఉత్తర్వులు జారీ చేసినా ఇంకా మహబూబ్నగర్ జిల్లాలో వేతనాలు ఇవ్వలేదని, కొన్ని జిల్లాలలో వేతనాలు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లాలో 200పైగా నియామకమైన ఉపాధ్యాయులందరికీ. వెంటనే వేతనాలు ఇవ్వాలనీ, ఎయిడెడ్ ఉపాధ్యాయుల నవంబర్ నెల వేతనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రమోషన్ పొంది 24సంవత్సరాలు పూర్తయినా ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ 22బీని అమలుపరుస్తూ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన సంపాదిత సెలవుల మంజూరుకు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని, గత కొంతకాలంగా డి.ఈ.ఓ కార్యాలయంలో పెండింగ్లో ఉన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలని డిఈఓ ను కోరారు. డిఈవోని కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులతో పాటు జిల్లా ఉపాధ్యక్షులు పి ఉమాదేవి, జిల్లా కోశాధికారి వీభాస్కర్, జిల్లా కార్యదర్శులు అజయ్, హేమంత్ కుమార్, మన్యం, కిష్ట్యా నాయక్, సుదర్శన్, ఖాదరయ్య, జయంతి, మహిళా సబ్ కమిటీ కో కన్వీనర్ కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు

# మంజూరైన అంబులెన్స్‌ను వెంటనే ప్రారంభించాలి

**వీపనగండ్ల డిసెంబరు 17 ప్రభాతవార్త :** సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్‌ను మంగళవారం నాడు ఆ పార్టీ నాయకులు మండల కార్యదర్శి డి బాల్‌రెడ్డి వీపనగండ్ల గ్రామ కార్యదర్శి సిహెచ్ వెంకటయ్య ఆశన్న జక్కుల సందర్శించడం జరిగింది. అనంతరం హాస్పిటల్‌కు కేటాయించిన అంబులెన్స్‌ను వెంటనే ప్రారంభించాలని, హాస్పిటల్లో సిబ్బందిని నియమించాలని హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి బాల్‌రెడ్డి మాట్లాడుతూ వీపనగండ్ల మండల కేంద్రంలో 30 పడకల హాస్పి టల్ ఉంది.కానీ అది పేరుకే నడుస్తుంది. సరైనటువంటి వైద్యులు, సిబ్బంది లేక ఇబ్బందులు గురవుతున్నారు. స్కానింగ్, ఎక్రే లేక రోగులు ఆందోళన గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల క్రితం వనపర్తి జిల్లాకు ఐదు అంబులెన్స్ కేటాయిస్తే వీపనగండ్ల ప్రభుత్వ ఆస్పిటల్ కూడా టౌజి 08 టి 5935 గల రిజిస్టర్ అంబులెన్స్‌ను కేటాయించడం జరిగింది.కానీ అది ప్రారంభించకుండానే సంగారెడ్డికి వెళ్లినట్లుగా తెలుస్తుంది. ఇక్కడ అంబులెన్స్ సౌకర్యం లేక గర్భిణీ స్త్రీలు, గుండెపోటు, పాము కాటు, ఇతరత్ర అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్ సౌకర్యం లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో ప్రజలు, ప్రజా సంఘాలు ఆందోళన ఫలితంగా సుగుణ పౌల్ట్రీ యాజమాన్యం ఒక అంబులెన్స్ ఇచ్చారు, దాని నిర్వహణ డీజిల్ కోసం రోగుల మీదనే 1500 రూపాయలు దాకా ఖర్చుఅయ్యేది.అది కూడా ఇప్పుడు లేకపోవడంతో రోగులు ఆందోళన గురవుతున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన అంబులెన్స్ ను వెంటనే స్థానిక నియోజకవర్గ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకొని అంబులెన్స్ ను ప్రారంభించాలని వారు కోరారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటల్ లో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బందిని, సౌకర్యాలను కల్పించాలని వారు కోరారు. ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు మాజీ ఉపసర్పంచ్ సిహెచ్ వెంకటయ్య, ఆశన్న, వెంకటేశ్వర్లుగౌడ్, నవీన్ పాల్గొన్నారు.



సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం కార్యకర్తలు

# ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

**గద్వాల ప్రతినిధి డిసెంబరు 17 ప్రభాతవార్త:** జిల్లాలో ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ బి.ఎంసంతోష్ పరిశీలించారు. మంగళవారం గద్వాల్ మండలంలోని పూడూర్ శివారులోని సర్వే నంబర్ 368 లో ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రాజెక్ట్ యొక్క లోకేషన్ మ్యాప్‌ను పరిశీలించి, అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. కోర్టు నిర్మాణానికి సంబంధించిన రెండు వర్గాల న్యాయవాదుల నుంచి సమస్యలు విన్నారు. కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం, గద్వాల కర్నూల్ జాతీయ రహదారికి సమీపంలో ఉన్నట్లు గుర్తించారు.కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి రహదారి కనెక్టివిటీని కూడా పరిశీలించి, ప్రధాన రహదారి నుంచి ఇక్కడికి మంచి రహదారి కనెక్టివిటీని నిర్మించవచ్చని పేర్కొన్నారు. రెండు ప్రదేశాలను పరిశీలించి, ప్రజల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా ఉంచుకుని,కోర్టు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో తహశీల్దార్ మల్లికార్జున్, ఇరు వర్గాల బార్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నూతన కోర్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

**ఆత్మకూరు డిసెంబరు 17 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి పేద ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని ఆత్మకూరు మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన ఎరుకలి నాగరాజు అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచడంతో స్థానికుల సమాచారం మేరకు సోమవారం రాత్రి దాడులు నిర్వహించి 49 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లుగా ఆత్మకూరు ఎస్సై నరేందర్ విలేకరులకు తెలిపారు. గత వారం రోజులుగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో సోమవారం రాత్రి పోలీస్ సిబ్బందితో దాడులునిర్వహించి దాదాపు 18క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని రెవెన్యూ అధికారులకుఅప్పజెయ్యడమే కాకుండా అక్రమంగా రేషన్ నిలువఉంచిన ఎరుకలి నాగరాజుపై కేసును మోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లుగా ఎస్సై తెలిపారు.

# రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలో ప్రథమ స్థానం గెలిచిన మోడల్ స్కూల్ విద్యార్థులు

**పెబ్బేరు డిసెంబరు 17 ప్రభాతవార్త:** పెబ్బేర్ మోడల్ స్కూల్ క్రికెట్ టీం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందారు. డిసెంబర్ 15,16 తేదీలలో వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి టి-10 అండర్ 15క్రికెట్ టోర్నమెంట్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరుపున రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొన్నారు. ప్రథమ స్థానం కోసం వరంగల్ జట్టుతో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో పెబ్బేర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.క్రికెట్ జట్టు కెప్టెన్‌చరణ్‌ను, జట్టు సభ్యులయిన సాక్షిక్,మహేశ్,భీష్మంత్,చందు,పరుశురాముడు, అఫ్రోజ్ ,యోగేశ్వర్,ఫర్హాన్ రేహాన్,గణేశ్‌లను ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి.నరేశ్ కుమార్ అభినందిస్తూ భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించాలని అకాంక్షించారు.ఈ విజయానికి మూలస్తంభంగా నిలబడ్డ ఫిజికల్ డెరెక్టర్ కమలాకర్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం జట్టు సభ్యులకు ట్రోఫీ ,మెడల్స్,సర్టిఫికెట్స్‌ను అందించారు. జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో మోడల్ స్కూల్ పెబ్బేర్ క్రికెట్ టీం ఉత్తరప్రదేశ్ లక్నో లో జనవరిలో ఆడనుంది.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చిన్నగోపాల్,చిన్నయ్య, విజయలక్ష్మి ,బుచ్చయ్య, మోసిన్ ,మంగమ్మ, నాగరాజు, రమేష్ ,ఫకీరయ్య, గంగాధర్ ,రవికుమార్,ఖదీర్,సుమిత్ర,హేమలత,హాఫీజ్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

**వెల్దండ, డిసెంబరు 17 ప్రభాతవార్త:** బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లక్ష్యంగా పని చేయాలని బీజేపీ పార్టీ జిల్లా నాయకులు, మాజీ ఎంపీటీసీ జంగయ్యయాదవ్ అన్నారు.వెల్దండ మండల పరిధిలోని రాచూరు గ్రామంలో జంగయ్య యాదవ్ అధ్యక్షతన బీజేపీ బూత్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూత్ అధ్యక్షులుగా గోదా ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, శివకుమార్‌లను ఎన్నుకున్నారు. బూత్ కమిటీని అభినందించి నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు శశిధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సురేష్‌రెడ్డి, రస్కో గణేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# రేపు ఎంవీఎస్‌లో జాతీయ సదస్సు

**మహబూబ్‌నగర్, డిసెంబరు17, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ పల్లిలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సహకారంతో ఈనెల19న ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. హైబ్రిడిటీ అండ్ బిలాంగింగ్ ఇంగ్లీష్ ఇన్ ఏ ట్రాన్సిషనల్ వరల్డ్ అనే అంశంపై జాతీయ సదస్సులో దేశవ్యాప్తంగా పరిశోధన పత్రాలను సమర్పిస్తారని సెమినార్ కన్వీనర్ జిరంగసూర్య తెలిపారు.సదస్సుకు ప్రముఖ కీ నోట్ స్పీకర్ నవలా రచయిత రఘుపతి, అసోసియేట్ ప్రొఫెసర్ సాంబయ్య రానున్నారని తెలిపారు. కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు ఖాదర్‌వలీ, ఉమాపాక,రామన్ గౌడ్, సుకీర్తి,శారద,కిరణ్,బాలకృష్ణ,నిహారికపాల్గొంటారని తెలిపారు.

# మనస్థాపనానికి గురై వ్యక్తి ఆత్మహత్య

**కృష్ణ, డిసెంబరు17 ప్రభాతవార్త:** మనస్థాపనకు గురై ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నారాయణపేట జిల్లా క్రిష్ణా మండల పరిధిలోని చెగుంట గ్రామ శివారులో సంఘటన జరిగింది. కృష్ణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెగుంట గ్రామానికి చెందిన బసవరాజు (48) అనే వ్యక్తి దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతుండే వాడని రోజు తాగి ఇంట్లో గొడవ పడేవాడని, అప్పుడప్పుడు ఇంట్లో చెప్పా పెట్టకుండ వెళ్లి మరల తిరిగి వచ్చేవాడని తెలిపారు. సోమవారం రాత్రి తన పొలానికి వెళ్లి అక్కడున్న వేప చెట్టుకు ఉరి వేసుకున్నాడని ఉదయాన్నే మృతుడి కుటుంబీకులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందడంతో, వెంటనే మృతుని కొడుకు గణేష్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం కొరకు మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణఎస్సై షేక్‌మహ్మద్ నవీద్ తెలిపారు.

# విజేతలకు బహుమతుల పంపిణీ

**మక్తల్, డిసెంబరు17 ప్రభాతవార్త:** మక్తల్ శ్రీ పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన సందెపు రాళ్ల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన ఆడెం లక్ష్మన్న జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఆడేంగోపి (సాయి గణేష్ మొబైల్స్) సమకూర్చిన మొదటి బహుమతి గుడెబల్లూర్ సూరి (116కేజీలు) 8తులాల వెండి అందించగా, రెండవ బహుమతి కింద 5తులాల వెండి ని కున్సి నర్సింహ (111కేజీలు), మూడో బహుమతి కింద 2 తులాల వెండిని పంచదేవ్ పాడ్‌నగేశ్ (105కేజీలు)లకు అందించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఈవో శ్యాంసుందర్ ఆచారి, ఆలయ ప్రధాన ధర్మకర్త ప్రాణేశా చారి, అరవింద చారి, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన పోరాడుతాం..

● మాజీ మార్కెట్ చైర్మన్ పి. నరసింహగౌడ్

**మక్తల్, డిసెంబరు17 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ హయంలో రోజు రోజుకు రైతులపై దాడులు, అణచివేత చర్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనిపై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాడుతామని మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహ గౌడ్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో రైతన్నలపై అక్రమంగా కేసులనునమోదు చేసి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన ఘటనకు నిరసనగా మంగళవారం మక్తల్ పట్టణంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా 167 వ జాతీయ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రాజేష్ గౌడ్, మక్తల్ మండల పార్టీ అధ్యక్షులు ఎ. మహిపాల్ రెడ్డి, మక్తల్ టౌన్ అధ్యక్షులు జె.చిన్న హన్మంతు, నాయకులు రాజుల ఆశిరెడ్డి, కౌన్సిలర్లు మొగులప్ప, జగ్గలి రాములు, నాయకులు సోంభూపాల్ గౌడ్, నిరంజన్ గౌడ్, సుధాకర్ రెడ్డి, మన్నన్, నర్సింహులు, దండు నాగిరెడ్డి, జుట్ల సాగర్,బండారి ఆనంద్, చిట్యాల ఉమాశంకర్ గౌడ్, భాస్కర్, కుర్వ అంజప్ప, కుర్వ వినోద్, ప్యాట నర్సింలు పాల్గొన్నారు.

## కందుల గిట్టుబాటు ధరకై రైతుల రాస్తారోకో

మొదటిపేజీ తరువాయి భాగం..



సద్దుమణిగించేందుకు ప్రయత్నిం చారు రైతులు వినలేదు. ఆర్డిఓ రాస్తారోకో దగ్గరికి చేరుకుని మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ హనుమంతు, కొను గోలు దారులతో చర్చించారు. ఉన్నరేట్లకుఅనుగుణంగా రూ.250 పెంచి రైతులను శాంతిం చారు. పండించిన పంటను అమ్ము కుంటే పెట్టుబడి సైతం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రైతులను మోసం చేయడమే తప్ప రైతులను ఆదుకునే నాథుడు లేరన్నారు. మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులకు ఇబ్బందులు తప్ప లేదు. కొంతమంది రైతులు భోజనాన్ని ఇంటి నుండి తీసుకువచ్చి ధర్నా దగ్గరే తిన్నారు. ధర్నాలో కూర్చున్న రైతులకు కొంతమంది రొట్టెలు తినడానికి ఇవ్వగా మరి కొంతమంది స్వచ్ఛందంగా రైతులే తాగు నీటిని పంపిణీ చేశారు. ఉదయం 11 గం.లకు ప్రారం భమైన రాస్తారోకో సాయం త్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. రాస్తారోకో కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ఆందోళన సద్దుమణిగించేందుకుపోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధన ఒక ఆకాంక్ష

◆ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి



కొత్తకోటలో విశ్రాంత భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కొత్తకోట డిసెంబరు17 ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు, విశ్రాంత ఉద్యో గులు చేసిన సేవలు చాలా గొప్పవి అని దేవరకద్ర ఎమ్మెల్యే మధు సూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కొత్తకోటలో విశ్రాంత ఉద్యోగుల భవన ప్రారంభోత్స వానికి ముఖ్య తితులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు మొదటి రోజునే పెన్షనర్ల వేతనాలు ప్రజాపాలనలో పడుతున్నాయని అన్నారు. మన ప్రాంతవాసి మన జిల్లా నాయకుడు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తూ పాలమూరు అభివృద్ధికి పాటుపడుతున్నాడని తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు ఈ అసెంబ్లీ సమా వేశంలో చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లి మీ సమస్యలు పరిష్కరించే దిశగాపని చేస్తానని హామీ ఇచ్చారు. విశ్రాంత ఉద్యోగులకు ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ముందుగా ఎమ్మెల్యే విశ్రాంత ఉద్యోగులు ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు. ముందుగా ఎమ్మెల్యే నిధులు, కాలనీ వసూల నిధుల ద్వారా వేసిన సీసీ రోడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, సీడీసీ చైర్మన్ గొల్లబాబు, కురుమూర్తి దేవస్థాన సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి మాదన్న, ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, వెంకటయ్య, కోశాధికారి రవీందర్‌రెడ్డి, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బిచుపల్లి యాదవ్, వేముల శ్రీనివా స్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, బోయజ్, మేస్త్రి శ్రీను, సుభాష్, మాజీ సర్పంచులు మన్యం, బాలరాజు యాదవ్, సోషల్ మీడియా అమ్మపల్లి బాలకృష్ణ, వెంకటేష్, గోకరయ్య, సంద వెంకటేష్, కరాటే శివ, మతిన్, ముస్తఫా, పెంటన్న యాదవ్, బాలరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పెన్షనర్స్ దినోత్సవం



**బిజినపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** పాలెంలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ భవనం లో మంగళవారం ఘనంగా జాతీయ పెన్షనర్స్ దినోత్సవం నిర్వహించారు. పెన్షనర్లు పితామహుడు డీకే నకారకు నివాళులు అర్పించారు. నకార సేవలను పాలెంశాఖ విశ్రాంత ఉద్యోగుల అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు బాలకిష్టయ్య, గాడి సురేందర్ లు కొనియాడారు. అనంతరం సీనియర్ విశ్రాంత ఉద్యోగి పెంటయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్ వందన సమర్పణ చేశారు. విశ్రాంత ఉద్యోగులు శారద, కొండమ్మ, సత్యమ్మ, హస్సన్ ధర్మరాజు సింగ్, అబ్దుల్ ఘని, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు విధులకు ఆటంకపరచిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

**తెలకపల్లి, డిసెంబరు17 ప్రభాతవార్త:** డ్యూటీలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకప రిచిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై బి. నరేష్ అందించిన వివరాలు ప్రకారం ఈనెల 15 న మధ్యాహ్నం మండల కేంద్రంలోని లింగాల రోడ్డులో ఉన్న భారత్ పెట్రోల్ బంక్ వద్ద గొడవ జరుగుతుందని సమాచారం రాగా డ్యూటీలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ రేణయ్య అక్కడ చేరుకొని సర్ది చెప్పే ప్రయత్నం చేస్తుండగా తెలకపల్లి గ్రామానికి చెందిన రజనీకాంత్, కొంగరి జయప్రకాష్, ఇద్దరు కలిసి డ్యూటీలో ఉన్నటు వంటి కానిస్టేబుల్ రేణయ్య తో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంక పరిచినందుకు కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి న్యాయమూర్తి ముందుహాజరు పరచగా వారి నిర్ణయం మేరకు ఈకేసులోఉన్నఇద్దరు వ్యక్తులనురిమాండ్‌కు తరలించినట్లుఎస్సైబి నరేష్ మంగళవారం తెలిపారు.

## చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్




నిందితులను అరెస్టు చేసిన పెబ్బేరు పోలీసులు



రికవరీ చేసిన వస్తువులు

**పెబ్బేరు డిసెంబరు 17 ప్రభాతవార్త :** పెబ్బేరు పోలీస్ స్టేషన్లో గత నెల 11-11-2024 రోజు దవాజ్ పల్లి గ్రామానికి చెందిన పెద్దముక్కల నందమ్మ ను ఇద్దరు వ్యక్తులు ఫోన్లో పరిచయం చేసుకొని పెబ్బేరుకు రమ్మని పిలిపించి మాయమాటలు చెప్పి బీచ్ పల్లి ప్రాంతంలో తీసుకపోయి నందమ్మ వద్ద ఉన్న కడియాలు, కమ్మలు, మ్యాటీలు ఇప్పించుకొని వారిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు వెంటనే పెబ్బేర్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేయగా పెబ్బేర్ ఎస్సై హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంక్వయిరీ చేసి ఇద్దరు దొంగలను ఎ1 బోయ శివ, ఎ2 జయన్న గద్వాల జిల్లాకు చెందిన ఇద్దరిని వ్యక్తులను మంగళవారం రోజు అరెస్టు చేసి కోర్టుకు తరలించమని పెబ్బేర్ ఎస్సై సిహెచ్ హరిప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

## తల్లి, కూతురు అదృశ్యం : కేసు నమోదు



అదృశ్యమైన తల్లి కూతురు

**తెలకపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** తల్లి కూతురు అదృశ్యంపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై బి.నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన జంగం శ్రీను అదే గ్రామానికి చెందిన జంగం మంజుల (23)తో 10 సంవత్సరాల క్రితం వివాహం కాగా వారికి 6 సంవత్సరాల బిందుశ్రీ, అనే కుమార్తె ఉందని ఇరువురు భార్యాభర్తలు సోమవారం కూలి పనికి పోయి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత మంజుల ఎవరితోనో ఫోన్ మాట్లాడుతూ తన భర్తను చూసి ఫోన్ కట్ చేయగా విషయం భర్త శ్రీను అడగగా నీకెందుకని సమాధానం చెప్పినదని ఆ తర్వాత రాత్రి యధావిధిగా భోజనం చేసి ఇరువురు తమ ఇంట్లో నిద్రించగా మంగళవారం ఉదయం శ్రీను నిద్రలేచి చూసేసరికి తన భార్య మంజుల, కూతురు బిందుశ్రీలు కనిపించలేదని ఎంత వెతికినా వారి ఆచూకీ దొరకకపోవడంతో మంజుల భర్త శ్రీను మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి నరేష్ తెలిపారు.

## బాధితునికి ఫోన్ అప్పగింత




**గోపాల్ పేట డిసెంబరు 17 ప్రభాతవార్త:** గోపాల్ పేట మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన జక్కుల కురు మయ్య అను వ్యక్తి తన ఇరవై వేల రూపాయల విలువగల ఫోను సెప్టెంబర్ 20, 2024 వ తేదీన పోయిందని గోపాల్ పేట పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయాగ, ఆ ఫోన్ ను సి ఈ ఐఆర్ అనేసాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గుర్తించి, మంగళవారం రోజున బాధితునికి పోను అప్పచెప్పినట్లు గోపాల్ పేట ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

## సంపూర్ణ అభియాన్‌పై సమీక్షించిన కలెక్టర్




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు17 ప్రభాతవార్త:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఈ నెల 26 న నారాయణపేట జిల్లాలోని నర్వ మండలంలో పర్యటి స్తున్న సందర్భంగా మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ విద్యా, వైద్య, సంక్షేమ, వ్యవసాయ, భూగర్భ జల శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ నీతి అయోగ్ సూచించిన రంగాలలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతి గురించి ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాఖల వారీగా అన్ని నివేదికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమాల అమలు తీరుపై కేంద్ర సహా య మంత్రి సమీక్షిస్తారని, అధికారులు ప్రగతి నివేదికలను తయారు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. విద్య, వైద్య, సంక్షే మ శాఖల పనితీరు సంతృప్తి పరంగా ఉన్నా, వ్యవసాయ శాఖ చేపట్టాల్సిన మట్టి నమూనాల సేకరణ ఎందుకు జరగలేదని కలెక్టర్ డీఏఓ జాన్ సుధాకర్‌ను ప్రశ్నించారు. స్పందించిన డీఈ వో ప్రస్తుతం రైతులు పొలాల్లో పంటలు వేశారని, మట్టి నమూ నాలను సేకరించడం సాధ్యం కాదని తెలిపారు. దీనిపై క్లారిటీ తో ఉండాలని కలెక్టర్ డీఏఓకు సూచించారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల, డీఆర్డిఓ మొగులప్ప, డీపీఓ కృష్ణ, డిఇఓ గోవిందరాజులు, భూగర్భజల శాఖ అధికారిని రమాదేవి, జిల్లా వైద్యశాఖ అధికారిని డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, డా. శైలజ, జిసిడిఓ పద్మనళిని, డిడబ్ల్యుఓ జయ, నర్వ ఎంపీడీఓ, సిడిపిఓలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలలో 426 మోసాలు

◆ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



ఉదండాపురంలో పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షునికి నియామక పత్రం అందిస్తున్న జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

**ఇటిక్యాల డిసెంబరు 17 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలలో 426 మోసాలలో కొన్ని హామీలు మాత్రమే నెరవేర్చారని మహిళలకు ఉచిత బస్సు ఉన్న ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం నిధులు చెల్లించడం లేదని రైతులకు 40 శాతం మాత్రమేరుణమాఫీ ప్రభుత్వం చేసిందని ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని విమర్శిం చారు. మంగళవారం ఉమ్మడి మండల పరిధిలోని కోదండపురం. ఉదండాపురం గ్రామాలలో 32 పోలింగ్ బూత్‌లకు బిజెపి పార్టీ నుండి అధ్యక్షులను నియమించి వారికి జిల్లా బిజెపి పార్టీ అధ్య క్షుడు రామచంద్రారెడ్డి, మండలాల పార్టీ అధ్యక్షులు అబ్దుల్లా, జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం మీద 90శాతం ఉన్నాయని వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, సిసి రోడ్లు, గ్రామపంచాయతీ కొత్త భవనాలు నిర్మాణాలలో కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మాణాలు జరుపుతు న్నారని రేషన్ దుకాణాలలో ప్రతి వ్యక్తికి ఐదు కేజీల బియ్యం కేంద్రం ఉచితంగా ఇస్తుందని ప్రతి పథకంలో కేంద్రం 90 శాతం నిధులు విడుదల చేస్తుందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం కానీ, ప్రస్తుతం పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాలు స్వంతంగా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. అలాగే ఏడాది గడుస్తున్న స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించడం లేదని ఎప్పుడు ఎన్నికలు పెట్టినా బిజెపి పార్టీ స్థానిక సంస్థల్లో కూడా గెలుపొందు తుందన్నారు. జిల్లాలో 50వేల మందికి పైగా సభ్యులు బిజెపి పార్టీలో చేరారని అలాగే ప్రతి బూత్ కమిటీలకు అధ్యక్షుల నియామకం జరిగిందని వివరించారు. 22 నుండి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు నియామకం అనంతరం జిల్లా స్థాయి. రాష్ట్రస్థాయి పార్టీ అధ్యక్షులు నియామకం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కేకే రెడ్డి, రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షులు రాజశేఖర్ శర్మ, ఎర్రవల్లి ఇటిక్యాల మండల పార్టీ అధ్యక్షులు అబ్దుల్లా, జగదీశ్ రెడ్డి, నాయకులుపరుశురాం, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగముని, బిసిరెడ్డి, రాజగౌడ్, పరమేష్, వీరన్న, మహేష్, గోవిందు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్‌కు బిఆర్ఎస్ పార్టీ మద్దతు



బార్ అసోసియేషన్‌కు మద్దత్తు ఇచ్చిన బిఆర్ఎస్ నాయకులు

**గద్వాల డిసెంబరు 17 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కోర్టు సముదాయ నిర్మాణ స్థలం విషయంలో గత 10 రోజులు గా న్యాయవాదులు చేస్తున్న ఆందోళనకు బిఆర్ఎస్ పార్టీ తమ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పార్టీ నాయకులు నాగర్ దొడ్డి వెంకటరాములు, కురువ విజయ్ కుమార్ తో కలిసి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ జడ్పీ టీసీ, బాసు శ్యామల, హనుమంతు నాయుడు మంగళవారం బార్ అసోసియేషన్ సభ్యులకు తమ మద్దతు లేఖను అందజే శారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లా డుతూ గద్వాల న్యాయవాదాలు చేస్తున్న నిరసన సమంజసమై నదిగా తమ పార్టీ భావిస్తున్నదన్నారు. అదే సమయంలో న్యాయవాదులు, కక్షిదారుల రక్షణ, ప్రజల అవసరాలన కూడా దృష్టిలో ఉంచుకొని ఈ నిరసనకు మద్దతు ఇవ్వాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ పని సాధనకు గద్వాల బార్ అసోసి యేషన్ చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు మా పార్టీ మద్దతు గా నిలుస్తుందని బాసు హనుమంతు నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు అంగడి బసవరాజ్, మోనేష్, శేఖర్‌నాయుడు, నూర్ పాషా, శ్రీరాములు, గంజిపేట రాజు, తిరుమలేష్,ముని మోర్య, ఎస్.రాము నాయుడు, రాయ పురం వీరేష్, రోల్లి కృష్ణ, గంగిమాన్ దొడ్డి నరసింహులు, బాసు గోపాల్, భాస్కర్, అకేపోగు రాజు, ప్రభాకర్, ప్రవీణ్ కుమార్, మన్యం, బాసు బొజ్జయ్య నాయుడు, సామేలు రాజగో పాల్, టవర్ ముక్బాల్, ప్రతాపరెడ్డి, బీచుపల్లి, నరసింహులు, రాము, తిమ్మప్ప, రవి గౌడ్, నల్లగట్ల రాముడు, ఆంజనేయులు కర్రెప్ప, మునెప్ప, ఇమ్మనేయులు, వెంకటేష్, నర్సిం హా, కళ్యాణ్, పరుశరాముడు, జగదీ ష్, ముజీబ్, శ్రీకాంత్, కామేష్, కృష్ణ, రాముడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## లగచర్ల రైతులకు సంఘీభావంగా బీఆర్ఎస్ నిరసన



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు17, ప్రభాతవార్త:** లగచర్ల రైతులకు సంఘీభావంగా బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం నిర సన వ్యక్త చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కరఖ చౌరస్తాలో చేపట్టిన నిరసనలో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. లగచర్ల రైతులపై ఉన్న కేసులను వెంటనే ఎత్తివేయాలని వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసన కార్యక్రమాలు మరింత ఉదృతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

**జడ్చర్లలో:** బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు , మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సూచన మేరకు జడ్చర్లలోని సిగ్నల్ గడ్డ వద్ద అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. రైతులకు బేడీలా సిగ్గు సిగ్గు అంటూ ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్లు లత, రఘురాం గౌడ్. సారిక, జ్యోతి, నాయకులు కోడ్గల్ యాదయ్య, పాలాది రామ్మోహన్, పిట్టల మురళి, ఇమ్ము, శ్రీకాంత్, కరాటే శ్రీను, బాలు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** రైతన్నలపై పెట్టిన అక్రమ కేసులను ఎతివేసి వారిని వెంటనే విడుదల చేయా లని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నాగర్ కర్నూల్ నియోజకవర్గం లోని అన్ని మండల కేంద్రాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు పిలుపుమేరకు నాగర్‌కర్నూల్ నియో జకవర్గంలో అన్ని మండలాలలో బిఆర్ఎస్ నాయకులు కార్య కర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లల్లో నిర్బంధించి, అన్నం పెట్టే రైతుల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పైన చేస్తున్న కక్షపూరిత రాజకీయాన్ని పక్కన పెట్టి, వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో బి ఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గోపాల్‌పేట డిసెంబరు17 ప్రభాతవార్త:** గోపాల్ పేట మండలం లోని వివిధ గ్రామాలలో మంగళ వారం మండల బిఆర్ఎస్ అధ్యక్షులు బాలరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లగచర్ల గ్రామంలో జరిగిన సంఘట నలు మళ్లీ భవిష్యత్తులో ఎక్కడ పునరావృతం కాకుండా చూసే బాధ్యత ప్రభుత్వం మీద ఉందని వారు అన్నారు, తక్షణమే లగచర్ల రైతులను జైలు నుంచి విడుదల చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ ఉద్యమం కంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, పోల్కెపహాడ్ మాజీ సర్పంచ్ రాజు, మాలగోపాల్, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డిమతీన్, నాగరాజు, ఓంకార్, నరేష్‌నాయక్ వివిధ గ్రామాలనాయకులు పాల్గొన్నారు.

**మాగనూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మంగళవారం టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేతవిధానాలకు నిరసనగా. రైతన్న లపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తం గా అన్ని నియోజకవర్గాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను సమర్పించాలని. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయ కులు రాజుల ఆశిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటరెడ్డి, బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎల్లారెడ్డి, మల్లారెడ్డి, మధు సూదన్ రెడ్డి, అశోక్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, నర్సింహులు, పుల రాము, శంకర్ గౌడ్, శంకరప్ప, మరెప్ప, శ్రీను, విష్ణువర్ధన్ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, వెంకటేష్, తిప్పిరెడ్డి నాయుడు, జమిల్, పల్లెమారెప్ప, సూతరి రవి, నర్సింహా, అశోక్, గోవిందు, పిరు, సాయిలు, సుల్తాన్, రఘు, అశోక్, నాయకులు పాల్గొన్నారు.







## వార్తకు స్పందన

'వీపనగండ్ల అంబులెన్స్ ఎక్కడ?' వార్త కథనానికి స్పందించిన మంత్రి జూపల్లి




17-12-2024 వార్త పేపర్‌లో వచ్చిన న్యూస్



మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల డిసెంబరు 17 ప్రభాతవార్త:** వీపనగండ్ల అంబులెన్స్ ఎక్కడ? అనే శీర్షికతో మంగళవారం నాడు ప్రచురితమైన వార్త కథనా నికి పౌర సరఫరాల శాఖ పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ గురువారం నాడు వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రా నికి 108 అంబులెన్స్ ను పంపుతున్నట్లు సమా చారం ఇచ్చారు. అయితే ఈ అంబులెన్స్ ఈనెల రెండవ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రం మొత్తంలో వివిధ మండలా లకు 213 కేటాయించడం జరిగింది అయితే అందులో వనపర్తి జిల్లాకు ఐదు రాగాఅదే లిస్టులో రిజిస్ట్రేషన్ నెంబర్‌తో సహా వీపన గండ్ల మండలం పేరుమీద అంబులెన్స్ కేటాయించడం జరిగింది. అటు తర్వాత మూడవ తేదీ రోజు వనపర్తి జిల్లా కేంద్రంలో నాలుగు అంబులెన్స్‌ను వనపర్తి తాలూకా ఎమ్మెల్యే మేఘారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, డిఎంహెచ్ఓ ప్రారంభించారు అటు తర్వాత వీపన గండ్లకు మాత్రం 108 అంబులెన్స్ రాలేదు ఈ విషయం అధికారు లతో మాట్లాడగా వీపనగండ్లకు అంబులెన్స్ రాలేదని 108 ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధికారులుతో సమాచారం తెలుసుకోక వీపన గండ్లకు రాలేదని తెలియజేశారు. దానితో వార్త జర్నలిస్టు ఎంక్వైరీ చేసి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 108 అంబులెన్స్ ను రిజిస్టర్ నెంబర్ తో సహా మంగళవారం నాడు వార్తా కథనం ఇవ్వడం జరి గింది దాన్ని చూసిన మంత్రి స్పందిస్తూ గురువారం నాడు వీపన గండ్ల మండలానికి అంబులెన్స్ రావడం జరుగుతుందని వార్త విలేకరికి ఫోన్ ద్వారా తెలియజేశారు.

## ఘనంగా మైసమ్మ దేవత జాతర ఉత్సవాలు

**నారాయణపేట టౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** దామరగిద్ద మం డల పరిధిలోని మద్దెల్ భీడ్ గ్రామం స్టేజ్ సమీపంలో వెలిసిన మైసె మ్మ దేవత జాతర ఉత్సవాలను మంగళవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా గ్రామం నుండి ఆలయం వరకు బోనాల ఊరేగింపుతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆల యం చుట్టూ ప్రదర్శనలు చేసి అమ్మవారికి నైవేద్యంగా తీపి వంటలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా అమ్మవారిని కొలుస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజే శారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

## ప్రారంభమైన జిల్లా సీఎం కప్ 2024 పోటీలు

మొదటిపేజీ తరువాయి భాగం..

సాధించి పెట్టాలని తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశం గ్రామీణ యువతలోని ప్రతిభను వెలికితీయడం. ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా దేశానికి పతకాలు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన భాస్కర్, డివైఎస్ఓ సీతారాంనాయక్, డిఎస్పి శ్రీనివాసులు, వివిధ క్రీడా అసోసియేషన్ నాయకులు, పీఈటీలు, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

మొదటిపేజీ తరువాయి భాగం..

ఉద్యాన బోర్డు ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో ప్రధానంగా రాష్ట్రంలో వరి, పత్తి ఒక కోటి 60 లక్షల ఎకరాలలో పండిస్తే 12.42 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నట్లు, ఉద్యాన పంటలు 39శాతం ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటు రైతులు ఉద్యాన పంటల పై దృష్టి సారించాలని అన్నారు.

## సీఎం కప్ రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని బొల్లెద్దుల అమూల్య

**ఇటిక్యాల డిసెంబరు 17 ప్రభతవార్త:** జోగులాంబ జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలో ఖోఖో క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయిలో సీఎం కప్‌కు బొల్లెద్దుల అమూల్య విద్యార్థిని ఎంపి కైంది. మల్దకల్ మండలం కృతి రావల్ చెరువు గ్రామానికి చెందిన అమూల్య కొత్తకోట గురుకుల కళాశాలలోఇంటర్మీడియట్ చదువుతుండ గా మంగళవారం జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలలో ఖోఖో క్రీడలో అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీకి ఎంపిక కావడంతో ఎంఈఓ సురేష్, పీఈటీ ప్రశంస మెమొంటోను అందజే శారు. రాష్ట్రస్థాయి సీఎం కప్‌కు అమూల్య ఎంపిక కావడంతో మండల ప్రజలు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులువిద్యార్థికి అభినందనలు తెలిపారు.

## రైతుల పక్షానే కాంగ్రెస్ పార్టీ

◆ మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి

**నారాయణపేట టౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** రైతుల పక్షాన్నే కాంగ్రెస్ పార్టీ ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో కంది రేటు ఒక్కసారిగా పడిపోయిందని రైతులు ఖరీదు దారుల మీద నిరస న వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డు ముందు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి రైతుల పక్షాన నిలబడి ఆర్డీవోను పిలిపించి కొనుగోలు దారులు, రైతులు రైతు సం ఘాల నాయకులతో చర్చలు జరిపి కందులు అమ్మిన రైతులకు క్వింటా లుకు రూ.250లు పెంచి కొనుగోలు చేసే విధంగా కృషి చేశారు. రైతుల పక్షాన నిలబడి వారి బాగుకోసం కృషి చేయడం కేవలం కాంగ్రెస్ పార్టీ మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డికే సాధ్యమైందన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి ఎస్ఎస్ఎ ఉద్యోగుల హామీ నిలబెట్టుకోవాలి




మధ్యాహ్న సమయంలో ధర్నా చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

**లింగాల డిసెంబరు 17 ప్రభాతవార్త:** ఎస్ఎస్ఎ ఉద్యోగులకు సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని బెట్టుకోవాలని ఎస్ఎస్ఎ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలోమధ్యాహ్న భోజన సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎస్ఎస్ఎ ఉద్యోగులు మాట్లాడుతూ ఇప్పటి ఎస్ఎస్ఎ ఉద్యోగులు సమ్మె చేపట్టి 8 రోజులు కావస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పాఠశాల నుంచి 15 నుంచి 20 మంది ఎస్ఎస్ఎ ఉద్యోగులు సమ్మెలో ఉన్నారని వారు తెలిపారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని, మినిమమ్ పేస్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.